## క్లుప్తంగా

### శనగ కొనుగోళ్లు ప్రారంభం

బేల: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనగ కొనుగోళ్లను శనివారం సహకార బ్యాంకు బేల శాఖ మేనేజర్ సుధీర్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యమైన శనగలు తీసుకువచ్చి, క్వింటాలుకు మద్దతు ధర రూ.5,440 పొందాలన్నారు. కార్యక్రమంలో బేల, డోప్టాల సహకార సంఘాల సీఈవో తిరుపతి, ఠాక్రే ప్రఫుల్, నిపుంగే గణేష్, సుఖ్‌దేవ్, జైనథ్ మార్కెట్ కమిటీ కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్, మాఫారీ సత్యనారాయణ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

### 'కాంగ్రెస్‌తోనే సమస్యలు పరిష్కారం'


మాట్లాడుతున్న సామ రూపేష్‌రెడ్డి

బేల: కాంగ్రెస్‌తోనే ఆదివాసీల సమస్యలు పరిష్కరం అవుతాయని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలోని ఖార గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోహన్, శ్యామ్‌రావు, నాగోరావు, గ్రామపటేల్‌లు మనోహర్, మడావి సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

### డీలర్ల సమస్యల పరిష్కారానికి పోరాటం



మాట్లాడుతున్న రాజు

కైలాస్‌నగర్: రేషన్ డీలర్ల సమస్యల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా పోరాడుతామని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని వాసవి కన్యాక పరమేశ్వరీ ఆలయంలో డీలర్ల కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. క్వింటాల్‌కు రూ.300 కమిషన్ అందించేలా బియ్యం అన్‌లోడింగ్ చార్జీలను ప్రభుత్వమే భరించాలన్నారు. పామాయిల్ నూనె, కంది పప్పు, చక్కెర వంటి తొమ్మిది రకాల సరుకులు రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు.

### వేధిస్తే కఠిన చర్యలు తప్పవు

ఆదిలాబాద్‌టౌన్: ఎవరైనా పోకిరీలు అమ్మాయిలు, మహిళలను వేధిస్తే చర్యలు తప్పవని షీ టీం సభ్యులు హెచ్చరించారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. షీ టీం విధులు, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో షీ టీం సభ్యులు సుశీల, సత్య మోహన్ పాల్గొన్నారు.

### రన్ ఫర్ జీసస్


ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఉట్నూర్‌రూరల్: గుడ్‌ఫ్రై డేను పురస్కరించుకొని యూయూసీవైఏ క్రిస్టియన్ అధ్యక్షుడు డానియల్ పాస్టర్ ఆధ్వర్యంలో బిలీవర్స్ చర్చిలో పత్యేక ప్రార్థనలు, రన్‌ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. క్రైస్తవులు పెద్ద ఎత్తున హాజరై పట్టణ కేంద్రంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు జోసెఫ్, కుమార్, ఘాజీ మహ్మద్, రాజరత్నం, శామ్యూల్, జీవరత్నం, క్రైస్తవులు పాల్గొన్నారు.

### కుల సంఘాల సంక్షేమానికి కృషి

ఖానాపూర్: కుల సంఘాల సంక్షేమానికి కృషిచేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. పట్టణంలోని విద్యానగర్ కాలనీలో శనివారం గాయత్రి బ్రాహ్మణసంఘ భవనం ప్రారంభోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. సంఘ అభివృద్ధికి తనవంతుగా కృషిచేస్తానన్నారు. అనంతరం ఆయన్ను సభ్యులు సన్మానించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో మాజీ మంత్రి వేణుగోపాలాచారి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, నాయకులు కావలి సంతోష్, దయానంద్, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# అతివలకు అండగా న్యాక్

- కార్మికుల కుటుంబసభ్యులకు ఉచిత శిక్షణ
- వృత్తినైపుణ్య శిక్షణ, కుట్టుమిషన్ల అందజేత


కుట్టు శిక్షణలో నిమగ్నమైన మహిళలు, యువతులు

కైలాస్‌నగర్: కార్మిక కుటుంబాల్లోని మహిళల స్వయం ఉపాధికి న్యాక్ అండగా నిలుస్తోంది. కుట్టు మిషన్‌లో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేలా ఉచితంగా శిక్షణనందిస్తోంది. కుట్టు మిషన్‌లో రాణించేందుకు అవసరమైన మెళుకువలను నేర్పిస్తోంది. మూడు నెలల పాటు నైపుణ్యంతో కూడిన శిక్షణనివ్వడంతో పాటు విజయవంతంగా శిక్షణను పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా మిషన్లు, సర్టిఫికెట్లు అందజేస్తు వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతోంది.

**వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేలా ...**

కార్మిక శాఖ సహకారంతో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో కార్మిక శాఖ ద్వారా లేబర్ గుర్తింపు కార్డు కలిగిన వారి కుటుంబ సభ్యులైన మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ అందిస్తున్నారు. పట్టణంలోని కలెక్టర్‌చౌక్‌లోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ వెనుకల గల న్యాక్ కార్యాలయంలో ఈ శిక్షణ అందిస్తున్నారు. మూడు నెలల పాటు నిపుణులైన ఇన్‌స్ట్రక్టర్లతో వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా శిక్షణ నిర్వహిస్తున్నారు. కుట్టుపై పూర్తి నైపుణ్యాన్ని కల్పిస్తున్నారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి రూ.7వేల విలువగల కుట్టు మిషన్‌తో పాటు సామగ్రితో కూడిన కిట్ అందజేస్తున్నారు. అలాగే శిక్షణ పూర్తయిన తరువాత పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్నారు.

**అర్హులు వీరే..**

కార్మికశాఖ ద్వారా లేబర్ గుర్తింపు కార్డు కలిగిన ప్లంబర్, ఎలక్ట్రీషియన్, తాపీ మేస్త్రీ వంటి రంగాల్లో పనిచేసే కార్మికుల కుటుంబసభ్యులు శిక్షణకు అర్హులు. కార్మికుడి భార్య, కూతురు శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. లేబర్ కార్డులో వారి పేర్లు కలిగి ఉండి, వయస్సు 18 నుంచి 45 ఏళ్లలోపు ఉండాలి. ఇలాంటి వారు నేరుగా న్యాక్ కేంద్రంలో సంప్రదించి ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. బ్యాచ్‌ల వారీగా శిక్షణను అందిస్తారు. ఒక్కో బ్యాచ్‌లో 30మందికి శిక్షణను ఇస్తారు. 2010 లో ఈ శిక్షణను ప్రారంభించగా ఇప్పటి వరకు వందలాది మంది మహిళలు, యువతులకు శిక్షణ పొంది, స్వయం ఉపాధి దిశగా అడుగులు వేశారు.

### సందేహాలు లేకుండా శిక్షణ



న్యాక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ తమలాంటి వారికి ఎంతో ఉపయోగపడుతుంది. ఉచిత శిక్షణ అనగానే మొక్కుబడిగా నేర్పిస్తారని భావిస్తారు. కానీ ఇక్కడి ఇన్‌స్ట్రక్టర్ థియరీ తరగతుల్లో కానీ, ప్రాక్టికల్‌గా కానీ తమకెలాంటి సందేహాలు కలుగకుండా శిక్షణనిస్తున్నారు.

– లావణ్య, యువతి, హౌజింగ్‌బోర్డు

### స్వయం ఉపాధికి తోడ్పాటు



మార్కెట్‌లోని వివిధ విభిన్న డిజైన్లకనుగుణంగా శిక్షణ అందిస్తున్నారు. కుట్టు మిషన్‌లో నైపుణ్యాన్ని సాధించేలా తర్ఫీదునిస్తున్నారు. ఉచితంగా శిక్షణను అందించడంతో కుట్టు సామగ్రి, మిషన్లు అందజేస్తున్నారు. దీంతో స్వయం ఉపాధి పొందేందుకు ఎంతో తోడ్పడుతుంది.

– షహీన్ బేగం, గృహిణి, సంజయ్‌నగర్

# ప్రజాపాలనకు ఆకర్షితులై చేరికలు


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రజాపాలన, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రజాసేవాభవన్‌లో బేల మండలంలోని కాప్సి గ్రామస్తులు, ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్ కాలనీకి చెందిన పాటిల్ భూమారెడ్డి, జైనథ్ మండలం ఆకుర్ల గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ సునీత–దిలీప్‌లు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

ఇచ్చోడ: బోథ్ మండలంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు శనివారం బోథ్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చింతల బోరి గ్రామానికి చెందిన ముండే శ్రీధర్, అంకుష్ రాజు మచ్చేందర్ కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, డైరెక్టర్ ఇస్రు పటేల్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బత్తుల రమేశ్, గాజుల పోతన్న, ప్రకాష్ పాల్గొన్నారు.

# ఆత్రం సుగుణను గెలిపించుకుంటాం

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఏఐసీసీ ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థిగా సుగుణ పేరును ఖరారు చేసిన సందర్భంగా అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం శ్రీకాంత్‌రెడ్డి, పలువురు నాయకులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. సుగుణ గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేసి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ దుర్గం రాజేశ్వర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దామోదర్ రెడ్డి, నవీన రెడ్డి, నాగరాజు, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.


సుగుణను సన్మానిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

### బీఎల్వోలతో సమావేశం


మాట్లాడుతున్న తహసీల్దార్

ఖానాపూర్: ఎంపీడీవో కార్యాలయం సమావేశమందిరంలో తహసీల్దార్ శివరాజ్ ఆధ్వర్యంలో శనివారం బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఇందులో 12 బీ ఫాంలు అందజేయడంతోపాటు బీఎల్వోల యాప్ గురించి వివరించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదుతోపాటు బీఎల్‌వోల విధులు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ మంజుల, సూపర్‌వైజర్లు శ్రీలత, నిర్మల, తదితరులు ఉన్నారు.

### ఎండిన పల్లెప్రకృతి వనం



నార్నూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతివనం నిర్వహణ కరువై ఎండిపోతోంది. గాదిగూడ మండలంలోని పర్సువాడ పరిధిలోని పల్లె ప్రకృతి వనం పూర్తిగా ఎండిపోయింది. ఇందులో దాదాపు 40 రకాల మొక్కలు పెంచుతున్నారు. వన సేవకుడు లేక నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. సంబంధిత అధికారులు స్పందించి మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### పరీక్ష సామగ్రి అందజేత

ఇచ్చోడ: బోథ్ మండలంలోని సోనాల గ్రామంలో ప్రాథమిక పాఠశాల్లో శనివారం విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక దశలోనే విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసుదన్ పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో సామాజిక కార్యకర్త ఇర్షద్ అలీ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు.

### బావి మరమ్మతులకు నిధులు మంజూరు

బజార్‌హత్నూర్: మండలంలోని బోస్రా గ్రామంలో ఆరు దశాబ్దాలుగా ప్రజలకు తాగునీటి అవసరాలు తీరుస్తున్న ఓపెన్ బావి మరమ్మతులకు రూ. 9 లక్షలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరైనట్లు ఎంపీటీసీ సోన్‌టాకే గజానంద్ తెలిపారు. జనవరిలె అప్పటి ఎంపీడీవో రాథోడ్ రాధ శిథిలావస్థకు చేరిన బావిని పరిశీలించి నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. దీంతో నిధులు మంజూరు చేయించిన ఎంపీడీవో రాథోడ్ రాధకు, ఎంపీటీసీ సోన్‌టాకే గజానంద్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

### జోగు రామన్న పూజలు


పూజలు చేస్తున్న జోగు రామన్న

జైనథ్: మండలం గిమ్మ గ్రామంలోని ఎల్లమ్మ తల్లి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత సాధ్యమన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీటీసీ కోల భోజన్న పాల్గొన్నారు.

### క్రీడలతోనే స్నేహభావం

ఇచ్చోడ: క్రీడలతోనే స్నేహభావం పెంపొందుతుందని కాంగ్రెస్ నాయకులు ఆత్రం భాస్కర్ అన్నారు. శనివారం బోథ్ మండలంలోని కేశమ్‌గూడలో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ యువత క్రీడల్లో రాణిస్తూనే.. చదువుల్లో కూడా పోటీ పడాలన్నారు. కార్యక్రమంలో కోవ లక్ష్మణ్ పటేల్, ఆత్రం జైతు, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

### పనుల్లో పారదర్శకత పాటించాలి


ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

నేరడిగొండ: ఉపాధిహామీ పనుల్లో పారదర్శకత పాటించాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శనివారం మండలంలోని తేజాపూర్‌లో ఉపాధి పనులను పరిశీలించారు. పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు, నీడ సౌకర్యం కల్పించాలని సూచించారు. రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు, ఫీల్డ్ అసిస్టెంట్ అడెల్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు


పిల్లలను తీసుకెళ్లడానికి వసతి గృహానికి వచ్చిన కుటుంబసభ్యులు

ఇంద్రవెల్లి: ఈనెల 18న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. దీంతో తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు వసతి గృహాల వద్దకు చేరి తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. ఆయా పాఠశాల నిర్వాహకులు పై చదువుల కోసం ఎలా ముందడుగు వేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.

నేరడిగొండ: పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. నేరడిగొండ మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ సెకండరీ పాఠశాల, లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 372 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. శనివారం పరీక్షలు ముగియడంతో పరీక్ష కేంద్రాల నుంచి విద్యార్థులు ఆనందంగా బయటకు వచ్చారు. తమ తమ గ్రామాలకు వెళ్లారు. అనంతరం ఎంఈవో భూమారెడ్డి మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున విద్యార్థులు ఇంటి వద్దనే ఉండాలని సూచించారు.

# 'రైతులకు రెండున్నర కోట్ల ఆదాయం'



మాట్లాడుతున్న గోవర్ధన్ రెడ్డి

కైలాస్‌నగర్: జిల్లాలోని రైతులు తాము పండించిన సోయాబీన్ పంటను ప్రైవేట్ దళారులకు కాకుండా, నాఫెడ్ ద్వారా ప్రభుత్వానికి అమ్మడంతో రెండున్నర కోట్ల ఆదాయం సమకూరిందని జైనథ్ పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలోని 17 మండలాల్లో దాదాపు 60 వేల క్వింటాళ్ల సోయాబీన్ మార్కెట్‌కు తీసుకువచ్చి అమ్ముకోవడం జరిగిందన్నారు. ఒక్క జైనథ్ మండలంలోనే 36 వేల క్వింటాళ్ల సోయాబీన్ కొనుగోలు చేయడం జరిగిందన్నారు. కానీ కొంతమంది బీఆర్‌ఎస్ నాయకులు కొనుగోలు విషయాన్ని రాద్ధాంతం చేసి పైశాచిక ఆనందాన్ని పొందారని మండిపడ్డారు. దాదాపు 27 కోట్ల సోయాబీన్ కొనుగోలు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో నాయకులు కోడూరు రవి, భూమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సాదాసీదాగా సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ కనక మోతుబాయి

నార్నూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశం హాల్‌లో శనివారం ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సదాసీదాగా సాగింది. మొత్తం ఆరుగురు ఎంపీటీసీ సభ్యులకు నలుగురు మాత్రమే హాజరయ్యారు. ఎంఈవో రాపల్లి ఆశన్న, అటవీశాఖ నుంచి ఎఫ్‌బీవో శ్రీనివాస్, ఐసీడీఎస్ నుంచి సీడీపీవో శారదలు మాత్రమే హాజరయ్యారు. కనీసం శాఖల వారీగా ప్రగతి నివేదికలు చదివే వారు కరువయ్యారు. దీంతో సమావేశం తూతూ మంత్రంగా నిర్వహించారు. గిరిజన గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో బిందెడు నీటి కోసం కష్టాలు పడుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారని భీంపూర్ ఎంపీటీసీ సభ్యురాలు జాదవ్ రేణుక దిలీప్ వాపోయారు. నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. గ్రామ పంచాయతీలకు నియమించిన ప్రత్యేకాధికారులు ఇప్పటి వరకు గ్రామ పంచాయతీలను సందర్శించిన దాఖలాలు లేవని ఆరోపించారు. సమావేశంలో ఎంపీడీవో జవహర్, ఎంపీవో సత్యనంద్, ఏపీవో సురేశ్, సీనియర్ అసిస్టెంట్ శశిధర్‌రాజు, సిబ్బంది రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ ఆలోచనలతో రాణించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీనాథ్

తాంసి: విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలతో నూతనంగా ఆవిష్కరణలు తయారుచేసే విధంగా ఎదగాలని వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ టెక్నాలజీ రసాయనశాస్త్ర విభాగం ప్రొఫెసర్ కాశీనాథ్ అన్నారు. శనివారం భీంపూర్ మండలంలోని నిపాని ప్రాథమికోన్నత పాఠశాలలో పీఎం శ్రీ పథకంలో రాష్ట్రీయ ఆవిష్కర్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం, నూతన ఆవిష్కరణలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు, తరగతి గదులు, డిజిటల్ విధానంలో బోధనను పరిశీలించారు. విద్యార్థులకు డిజిటల్ క్లాస్‌రూం, బోధన చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులు ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలన చేయాలని సూచించారు. కార్యక్రమంలో పిప్పల్‌కోటి కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్యాంసుందర్, నిపాని పాఠశాల హెచ్‌ఎం సంతోష్ బేదోడ్కర్, ఉపాధ్యాయులు గంగయ్య, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మానవతావాదులు ఆదుకోవాలి


ఆర్థిక సాయం అందజేస్తున్న పాయల్ శరత్

ఆదిలాబాద్: హృదయ సంబంధ వ్యాధితో ఇబ్బంది పడుతున్న ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామానికి చెందిన పల్లికొండ వైష్ణవిని మానవతావాదులు ఆదుకోవాలని అడ సర్పంచ్, పాయల్ శంకర్ ఫౌండేషన్ చైర్మన్ పాయల్ శరత్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శనివారం బాలిక తండ్రి పల్లికొండ సంతోష్‌కు పాయల్ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ప్రస్తుతం గుండెలో ట్యూబ్స్ బ్లాక్ అవడంతో 54 శాతం మాత్రమే గుండె కొట్టుకుంటుందన్నారు. చికిత్స కోసం రూ. 3 నుంచి రూ. 5 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారన్నారు. మానవతావాదులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు వచ్చి చిన్నారిని ఆదుకోవాలని పిలుపునిచ్చారు.

## సమాచారం

### నేడు ఆలయ వార్షికోత్సవం

నేరడిగొండ: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ 8వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ గ్రామాల భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### రేపు తునికాకు కల్లేదార్ల సమావేశం

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఏప్రిల్ 1న ఉదయం 10 గంటలకు తునికాకు కల్లేదార్ల సమావేశం నిర్వహించనున్నట్లు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆత్రం తనుష్ ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్, కట్ట రేటు పెంపు, ఇతర సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. తునికాకు కల్లేదార్లు సమావేశానికి అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

### రేపు కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం

కైలాస్‌నగర్: కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తలతో ఏప్రిల్ 1న సమావేశం నిర్వహించనున్నట్లు అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు పట్టణ శివారులోని రత్న గార్డెన్‌లో నిర్వహించే సమావేశానికి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, పార్లమెంట్ అభ్యర్థి సుగుణ హాజరవుతారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.